క్లుప్తంగా

19న ఉచిత కంటి వైద్య శిబిరం

అలంపూర్: మండల పరిధిలోని క్యాతూర్ గ్రామంలో ఈ నెల 19వ తేదీన ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్యాంప్ ఇన్చార్జ్ శ్రీనివాస్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు వేదిక ఆవరణలో ఉదయం 10 గంటలకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తారన్నారు. కందూరు రాంరెడ్డి కంటి ఆస్పత్రి, లయన్స్ క్లబ్ మహబూబ్‌నగర్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఓటర్, లేదా రేషన్‌కార్డు లేదా ఆరోగ్యశ్రీ కార్డు తీసుకొని రావాలని సూచించారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

ప్రత్యేక తరగతులు సద్వినియోగం చేసుకోవాలి



ధరూరు: పదో తరగతి పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2024–25లో పదో తరగతి ఫెయిలైన విద్యార్థులకు నిర్వహిస్తున్న తరగుతులను శనివారం ఇన్‌చార్జి ఎంఈఓ రవీంద్రబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



శాంతినగర్: ఆర్ట్ ఆఫ్ గివింగ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పేదలకు శనివారం నిత్యావసర సరుకులు, శానిటరీ ప్యాడ్లు, పండ్లు పంపిణీ చేశారు. సైబర్‌గుడ్ అనే నినాదంతో ప్రొఫెసర్ అచ్యుత్ సమంత పిలుపు మేరకు తెలంగాణ వ్యాప్తంగా నిర్వహిస్తున్న అనేక సేవా కార్యక్రమాల్లో భాగంగా అయిజ, శాంతినగర్‌లో నిత్యావసర సరుకులు పంపిణీ చేసినట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా కోఆర్డినేటర్ సుధీర్‌కుమార్, సభ్యులు మధు, సుధాకర్, రఘు, గోవర్ధన్, రాజశేఖర్, గిరి, రాణాప్రతాప్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాంలు అందజేత



ధరూరు: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం ప్రత్యేకంగా స్టిచ్చింగ్ చేయించిన యూనిఫాంలను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేసినట్లు ఎంఈఓ రవీంద్రబాబు తెలిపారు. శనివారం స్థానిక ఎంఆర్‌సీ భవనంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు యూనిఫాంలు అందజేశారు. ఈ ఏడాది పాఠశాలల పునఃప్రారంభానికి ముందే పాఠశాలలకు యూనిఫాంలు చేరడం హర్షణీయమన్నారు. బడి బయటి పిల్లలందరూ పాఠశాలలో చేరే విధంగా గ్రామస్తులు సహకరించాలని ఎంఈఓ కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దు



గట్టు: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులకు గురి చేయొద్దని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మాచర్ల ప్రకాష్ కోరారు. శనివారం మండల కేంద్రంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి మాట్లాడారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో గన్నీ బ్యాగులు ఇవ్వడం లేదని, తరుగు పేరుతో దోపిడీకి పాల్పడుతున్నట్లు ఆరోపించారు. తూకం వేసి వడ్లను మిల్లులకు తరలించే బాధ్యత రైతులపై మోపుతున్నట్లు ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ మండల అధ్యక్షుడు మోజేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఈ రోడ్లపై ప్రయాణమెలా !

- గుంతలతో నిత్యం ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



గుంతలమయంగా అమరవాయి- సద్దలోనిపల్లి రహదారి



గుంతలమయంగా బిజ్వారం- బురెడ్డిపల్లి రహదారి

మల్దకల్: మండల పరిధిలోని ఆయా గ్రామాలకు వెళ్లే రహదారులు ప్రమాదభరితంగా మారాయి. రోడ్లపై ఏర్పడిన గుంతలతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, ప్రజలు భయాందోళనలో ప్రయాణాలు సాగిస్తున్నారు. ప్రజలు మృత్యువాత పడుతున్న ఇటు అధికారులు అటు ప్రజా ప్రతినిధులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండల పరిధిలో..

బిజ్వారం నుంచి గద్వాల, మల్దకల్ నుంచి గట్టు, తాటికుంట స్టేజీ నుంచి తప్పెట్లమొర్సు, ఎల్కూరు నుంచి మల్దకల్, మల్లెందొడ్డి నుంచి విఠలాపురం గ్రామాల రహదారులపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. రోడ్లపై ఏర్పడిన గుంతల్లో వర్షపు నీరు చేరి గుంతలు కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల పలువురు మృత్యువాత పడినట్లు ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. అదే విధంగా అయిజ- గద్వాల ప్రధాన రహదారిలోని శేషంపల్లి కాల్వ సమీపంలో పైప్‌లైన్ కోసం రోడ్డు తవ్వడంతో గుంతలు ఏర్పడి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్లపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేపట్టి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరినప్పటికీ అధికారుల్లో ఎలాంటి చలనం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లపై గుంతలకు మరమ్మతులు చేపట్టాలని, అదే విధంగా మలుపులు, కల్వర్టుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతు చేయాలి



అయిజ– గద్వాల రహదారిలోని శేషంపల్లి కాల్వ సమీపంలో రోడ్డుపై గుంతలు ఏర్పడి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు ప్రమాదాల్లో వాహనదారులు మృతి చెందుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. రోడ్డుపై ఏర్పడిన గుంతలకు వెంటనే మరమ్మతు చేయాలి.

– తిమ్మన్న, అమరవాయి

పైపులైన్ కోసం తవ్వారు



అమరవాయి నుంచి బిజ్వారం వెళ్లే రహదారిలో రైతులు పైప్‌లైన్ల కోసం రోడ్డుపై గుంతలు తవ్వారు. దీంతో రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. బీటీ రహదారికి అధికారులు మరమ్మతు చేపట్టకపోవడంతో వర్షపు నీరు నిలిచి గుంతలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి.

– గోవిందు, బిజ్వారం

సమస్యలు పరిష్కరిస్తాం



మండల పరిధిలోని ఆయా గ్రామాలకు వెళ్లే రహదారిలో ఏర్పడిన గుంతలకు మరమ్మతు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ఛిద్రమైన రహదారులను పరిశీలించి నివేదికలను ఉన్నతాధికారులకు అందజేశాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడుతాం.

– బషీర్, పంచాయతీరాజ్ ఏఈ. మల్దకల్

భారత్ మాతాకీ జై.. జయహో భారత్



గద్వాలలో తిరంగా యాత్రలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

గద్వాలటౌన్: భారత్ మాతాకీ జై.. జయహో భారత్ నినాదాలతో గద్వాల పట్టణం హోరెత్తింది. భారత సైనికుల సేవలను కీర్తిస్తూ, ఉగ్రమూకల అంతమే తమ సంకల్పమని నినదిస్తూ వందల మంది ప్రజలు త్రివర్ణ పతాకాలను చేతబట్టి కదం తొక్కారు. బీజేపీ నాయకులు, వివిధ సంఘాల నాయకులతో కలిసి ప్రజలు శనివారం పట్టణంలో ఉత్సాహంగా సాగింది. ఆపరేషన్ సిందూర్ విజయోత్సవం సందర్భంగా స్థానిక కోట నుంచి ప్రారంభమైన యాత్ర పట్టణ ప్రధాన రహదారుల వెంట సాగింది. ఈ సందర్భంగా బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు అప్సర్‌పాష మాట్లాడుతూ.. పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదుల్ని మట్టికరిపించిన భారత సేన ప్రపంచానికి తమ సత్తా చాటిందన్నారు. దేశమంతా సైన్యం వెంటే అంటూ తిరంగా యాత్ర ద్వారా సంఘీభావం తెలపాల్సిన బాధ్యత పౌరులందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామాంజనేయులు, రామచంద్రారెడ్డి, బండల వెంకట్రాములు, అక్కల రమాదేవి, రవికుమార్, జయశ్రీ, శివారెడ్డి, నర్సింహ, ధార్మిక సంఘాల నాయకులు మురళీకృష్ణ, రత్నసింహారెడ్డి, రాఘవేంద్రరావు, బ్రహ్మన్న తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



అయిజ: మండలంలోని పెద్ద ధన్వాడ గ్రామంలో ఈ నెల 20న నిర్వహించనున్న అంబేడ్కర్, జ్యోతిరావు పూలే విగ్రహ ఆవిష్కరణ వాల్‌పోస్టర్లను బీఎస్పీ, స్వేరోస్ నాయకులు శనివారం మండల కేంద్రంలో విడుదల చేశారు. విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాజు, వేమన్న, అలెగ్జాండర్, తిమ్మోతి, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

చినుకుపడితే చిత్తడే



అయిజ: పట్టణంలోని శనివారం కురిసిన తేలికపాటి వర్షానికే కొత్త బస్టాండ్ ప్రాంతం వర్షపు నీరు పూర్తిగా నిలించింది. దీంతో రోడ్డు పక్కన కూరగాయలు, పండ్లు విక్రయించే చిరు వ్యాపారులు అనేక ఇబ్బందులకు గురయ్యారు. రోడ్డుకు ఇరువైపుల వర్షపు నీరు నిలిచిపోవడంతో పాదాచారులు అనేక ఇక్కట్లకు గురయ్యారు. అధికారులు స్పందించి నీరు నిల్వ కాకుండా చూడాలని కోరుతున్నారు.

ముంపు భూములు పేదలకు పంచాలి



వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

అలంపూర్: శ్రీశైలం నీటి ముంపు పొలాలను పేదలకు పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రేపల్లె దేవదాసు కోరారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో శ్రీశైలం నీటి ముంపు భూములను పేదలకు పంచాలని వ్యవసాయ కార్మిక సంఘం అధ్వర్యంలో తహసీల్దార్ మంజులకు శనివారం వినతిపత్రం అందజేశారు. మండలంలోని సుల్తానాపురం గ్రామ శివారులోని నీటి ముంపు పొలాలను గత కొంత కాలంగా పేదలు సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న ఇద్దరు వ్యక్తులు ఈభూమి తమదని వాటిని విక్రయించడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వానికి చెందిన భూములు విక్రయించకుండా అడ్డుకోవాలన్నారు. ప్రభుత్వ భూమిని భూమి లేని పేదలకు పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో మాస్టర్లకు సత్కారం



అయిజ: ఈనెల 12 నుంచి 15 వరకు విజయనగరంలో నిర్వహించిన నేషనల్ తైక్వాండో సెమినార్ కోర్సులో పాల్గొని ఉత్తమ ప్రదర్శన కనబర్చిన మండలానికి చెందిన సుధీర్ కుమార్, వెంకటేష్‌కు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో తైక్వాండో విద్యార్థులు శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ పనులు పర్యవేక్షించాలి



మూసాపేటలో ఉపాధి హామీ ప్రజావేదికలో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ నర్సింహులు

అడ్డాకుల: గ్రామాల్లో జరిగే ఉపాధి హామీ పనులను సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని డీఆర్‌డీఓ నర్సిములు అన్నారు. మూసాపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం జరిగిన 4వ విడత సమాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. 2024 ఏప్రిల్ 1నుంచి 2025 మార్చి 31 వరకు మండల వ్యాప్తంగా ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో రూ.3.33కోట్లు, పీఆర్‌లో రూ.1.41కోట్ల పనులు జరిగాయి. వాటిపై ఇటీవల తనిఖీ బృందం గ్రామాల్లో విచారణ చేపట్టి నివేదిక రూపొందించారు. ఏపీడీ ముసాయిదాబేగం, ఫైనాన్స్ మేనేజర్ ప్రేమలత, అంబుడ్స్‌మెన్ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ప్రజావేదికకు డీఆర్‌డీఓ నర్సింహులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొక్కల పెంపకంలోనే ఎక్కువగా అవకతవకలు జరిగినట్లు తనిఖీ బృందం గుర్తించింది. తక్కువ సంఖ్యలో మొక్కలు నాటి, ఎక్కువ రికార్డు చేయించడం, వాటర్ ట్యాంకర్ పేమెంట్ చేసినా చాలా చోట్ల మొక్కలు ఎక్కువగా ఎండిపోవడం నివేదికలో వెల్లడైంది. దీంట్లో చక్రాపూర్, నందిపేట, దాసర్‌పల్లి, స్ఫూర్తితండా, కొమిరెడ్డిపల్లి గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ టీఏలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సిఫారసు చేసినట్లు ఎస్ఆర్‌పీ కె.స్వామి తెలిపారు. తనిఖీ బృందాలు గుర్తించిన దాంట్లో మండల వ్యాప్తంగా సుమారు రూ.54లక్షల మేర అవకతవకలు జరిగినట్లు గుర్తించగా ప్రజావేదికలో మాత్రం అధికారులు రూ.వేలల్లోనే ఉందని లెక్క తేల్చడం గమనార్హం. మండలంలోని గ్రామాల్లో జరిగిన ఉపాధి పనులను సరిగ్గా పర్యవేక్షించలేదని విచారణ సందర్భంగా పలుమార్లు ఎంపీడీఓ కృష్ణయ్యను డీఆర్‌డీఓ మందలించారు.

రైతులకు మేలు జరిగే వాటికి ప్రాధాన్యం : డీఆర్‌డీఓ నర్సింహులు

ఉపాధిహామీలో రైతులకు మేలు జరిగే పనులకే ఎక్కువగా ప్రధాన్యం ఇవ్వాలని డీఆర్‌డీఓ నర్సింహులు అన్నారు. ప్రజావేదిక పూర్తయిన తర్వాత ఆయన మాట్లాడుతూ చిన్న, సన్నకారు రైతులకు ఉపయోగపడే పనులతో పాటు ఫీడర్ ఛానల్, చెక్‌డ్యాం వంటి పనులను చేయించేలా చూడాలని చెప్పారు. ఉపాధి పనును ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓలు, ఏపీఓలు గ్రామాల్లో జరిగే పనులను పర్యవేక్షిస్తే అవకతవకలకు ఆస్కారం ఉండదని చెప్పారు. పారదర్శకంగా పనులు జరిగేలా ఉపాధిహామీ సిబ్బంది పని చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణయ్య, ఎంపీఓ అనురాధ, ఇన్‌చార్జి ఏపీఓ పులేందర్, ఎస్ఆర్‌పీ కె.స్వామి, డీఆర్‌పీలు సతీష్, కార్యదర్శులు, ఎఫ్ఏలు, మేటీలు తదితరులు ఉన్నారు.

జెడ్పీ జీపీఎఫ్ స్లిప్స్ ఆన్‌లైన్ చేయాలని వినతి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి జెడ్పీజీపీఎఫ్ స్లిప్స్ ఆన్‌లైన్ చేయాలని కోరుతూ పీఆర్టీయూ నాయకులు జెడ్పీసీఈఓ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శులు మదన్‌మోహన్‌యాదవ్, సుధాకర్‌రెడ్డిలు మాట్లాడుతూ స్లిప్‌లు ఆన్‌లైన్ చేసిన తర్వాత అందుకు సంబంధించి జమ అయిన వడ్డీ నిధులను కూడా జమచేయాలని కోరారు. ఈ సందర్భంగా సీఈఓ స్పందిస్తూ సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బుచ్చారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలి

మానవపాడు: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని బాలల సంరక్షణ జిల్లా లీగల్ అధికారి ఎత్తం శివ అన్నారు. మండలంలోని అమరవాయి గ్రామంలో శనివారం ఉపాధి హామీ కూలీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహంపై 1098కు సమాచారం అందించాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఉన్నత విద్య అందించాలన్నారు. సామాజిక మాధ్యమాలకు యువతను దూరంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ రుకుమొద్దీన్, శిరీష, వేణు, విజయ్, నిర్మిల పాల్గొన్నారు.

ఎన్నికల్లో వ్యూహాత్మకంగా వ్యవహరించాలి



సమావేశంలో బీజేపీ నాయకులు

అయిజ: రాష్ట్రంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వ్యూహాత్మకంగా వ్యవహరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ సంస్థాగత నిర్మాణంపై చర్చించారు. పార్టీలోని వివిధ శాఖల నాయకుల జాబితాను సమర్పించారు. ముఖ్య అతిథిలుగా సంరచన కార్యశాల ఇన్‌చార్జ్ విద్యాసాగర్ రెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, గద్వాల నాయకురాలు అక్కల రమాదేవి హాజరై మాట్లాడారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త క్రియాశీలకంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపాలకృష్ణ, శ్రీనివాసులు, లక్ష్మణ్‌గౌడ్, లక్ష్మణాచారి, నాగరాజు, రాజశేఖర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి జాగ్రత్తలపై కళాజాతా



కళాజాత ప్రదర్శన నిర్వహిస్తున్న సభ్యులు

మల్దకల్: మండలంలోని అడివిరావల్‌చెర్వు గ్రామంలో వేసవి జాగ్రత్తలపై శనివారం కళాజాత బృంద సభ్యులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలపై ఆటపాటల ద్వారా వివరించారు. కార్యక్రమంలో కళాజాత బృందం సభ్యులు రాహుల్, హజరత్, ఉషా, స్వప్న, వెంకటేష్, బాష పాల్గొన్నారు.

పకడ్బందీగా ఉపాధ్యాయుల శిక్షణ



మాట్లాడుతున్న వెంకటనర్సమ్మ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల శిక్షణ పకడ్బందీగా, ఎటువంటి లోటు పాట్లకు తావు లేకుండా నిర్వహించాలని విద్యాశాఖ సమగ్రశిక్ష జాయింట్ డైరెక్టర్ వెంకటనర్సమ్మ జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని భగీరథ కాలనీ వద్ద ఉన్న మైనార్టీ గురుకులంలో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమానికి ఆమె హాజరై శిక్షణ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈఓ ప్రవీణ్‌కుమార్‌తో సమావేశమై పలు అంశాలతో చర్చించారు. ఎంత మంది ఉపాధ్యాయులకు శిక్షణకు వస్తున్నారని, ప్రస్తుతం ఏ అంశాలపై శిక్షణ ఇస్తున్నారని, రెండో దశంలో ఎంత మంది ఉపాధ్యాయులు హాజరవుతారని అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల శిక్షణలో పూర్తి స్థాయిలో అంశాలను అవగాహన కలిగేలా చూడాలన్నారు. దీంతో పాటు తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ శివయ్య, వయోజన విద్య జిల్లా అధికారితో పాటు పలువురు అధికారులను పలు కార్యక్రమాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, సీఎంఓ బాలుయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు, తరలింపులో జాప్యం వద్దు



తనిఖీ చేస్తున్న అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు

గోపాల్‌పేట: వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీసుకొచ్చే వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయడంతో పాటు మిల్లులకు తరలించాలని అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) వెంకటేశ్వర్లు సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆయన మండలంలోని బుద్దారం, పొలికెపాడు, గోపాల్‌పేట, ఏదుట్ల, చెన్నారంలోని వరి కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోళ్లు, మిల్లులకు ధాన్యం తరలింపు వివరాలు ఎప్పటికప్పుడు రిజిస్టరులో నమోదు చేస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత మిల్లులకు తరలించడంలో జాప్యం జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే రైతులు నిబంధనల ప్రకారం తాలు, గడ్డి లేకుండా ఉండేలా చూడాలన్నారు. ఆయన వెంట స్థానిక రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

పాన్‌గల్: కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బందులు కలిగించొద్దని మండల వ్యవసాయాధికారి (ఏఓ) రాజవర్ధన్‌రెడ్డి కేంద్రాల ఇన్‌చార్జిలకు సూచించారు. శనివారం మండలంలోని రేమద్దుల గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాలను సందర్శించి ధాన్యం సేకరణ, సేకరించిన ధాన్యం తరలింపుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్రానికి తీసుకొచ్చిన ధాన్యం వివరాలను రికార్డులో నమోదు చేసి తేమ శాతం వివరాలను రైతులకు వివరించాలన్నారు. నిబంధనల మేరకు ధాన్యం సేకరించాలని నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఏఈఓ, రైతులు పాల్గొన్నారు.

‘స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు డిపాజిట్లు దక్కవు’



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు డిపాజిట్లు కూడా దక్కవని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని శ్రీనివాసగార్డెన్‌లో జరిగిన నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఒక్క పిలుపుతో తరలి వచ్చిన కాంగ్రెస్ శ్రేణులు ఇదే ఉత్సాహం, పట్టుదలతో స్థానిక ఎన్నికల్లో జయకేతనం ఎగురవేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకు తీసుకుపోవాలని కోరారు. జూన్ చివరి వారం లేక జూలై మొదటి వారంలో స్థానిక ఎన్నికలు రాబోతున్నాయని, ఇప్పటి నుంచే కార్యకర్తలు సంసిద్ధం కావాలని కోరారు. పార్టీని నమ్ముకున్న ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత క్రమంలో పదవులు వరిస్తాయని తెలిపారు. గోపన్‌పల్లిలోని చెరువుకు కోయిల్‌సాగర్ నీటిని అందించడానికి అధికారులతో మాట్లాడుతామని ఎమ్మెల్యే తెలిపారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

అభ్యర్థులు ఎవరైనా కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని పార్టీ పరిశీలకులు దొమ్మటి సాంబయ్య కోరారు. పార్టీ నిర్మాణమే ముఖ్యమని సంస్థాగతంగా బలోపేతం చేయడం కోసం ఐక్యంగా పని చేయాలని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రాజ్యాంగ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తలపెట్టిన జై బాపు, జైభీమ్, జై సంవిధాన్‌ను గ్రామస్థాయి బూత్ స్థాయికి చేర్చాలని కోరారు. బ్లాక్, మండల, గ్రామ పార్టీ అధ్యక్ష పదవులకు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. సమావేశంలో మరో పరిశీలకులు భాస్కర్ యాదవ్, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్లు ప్రశాంత్, కతలప్ప, కాంగ్రెస్ మండల అధ్యక్షులు అంజిల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, కోనరాజశేఖర్, హన్మంతరెడ్డి, నాగిరెడ్డి, శేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గోపన్‌పల్లిలో స్ప్రింకర్ల పంపిణీ

మండలంలోని గోపన్‌పల్లిలో సీసీరోడ్లు ఇంకా పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి భూమిపూజ చేసి ప్రారంభించారు. అదే విధంగా రైతులకు స్ప్రింకర్లు, జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు.

ప్రజా నాయకుడు ఈర్ల నర్సింహ

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తు ప్రజా నాయకుడిగా ఈర్ల నర్సింహ పేరు తెచ్చుకున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్ అన్నారు. ఈర్ల నర్సింహ 2వ వర్ధంతి సందర్భంగా శనివారం ఆ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వెలుగొండ గ్రామ సర్పంచ్‌గా, ఎంపీటీసీగా బిజినపల్లి వైఎస్ ఎంపీపీగా, ఉమ్మడి జిల్లా పార్టీ కార్యదర్శిగా పని చేశార న్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు కొండపల్లిరాము, జిల్లా కౌన్సిల్ సభ్యులు చాంద్‌పాషా, హనుమంతు, రవి, శ్యాం, మోహన్, బాషా పాల్గొన్నారు.